# శ్రీ విశ్వదత్త వ్రత కథ

## ప్రథమాధ్యాయం

**ఓం గం గణపతయే నమః**

**ఓం శ్రీం విశ్వదత్తాయ నమః । ఓం శ్రీ సాయిరాం గురుదేవదత్త ॥**

శ్రీ దత్తాత్రేయావతారులైన శ్రీ విశ్వయోగి విశ్వంజీ సద్గురు మహరాజ్ గుంటూరు - చెన్నై జాతీయ రహదారిపై 16వ కి.మీ. దగ్గరగల **"విశ్వనగర్"**లో సనాతన ధర్మ పరిరక్షణకై **"విశ్వమానవ సమైక్యతా స్తూపము"**నకు భారతదేశ మహోన్నత న్యాయస్థానము యొక్క ప్రధాన న్యాయాధిపతి గౌరవనీయులు శ్రీ రంగనాథ మిశ్రా గారిచే శంఖుస్థాపన జరిపించిన తరువాత వారి కీర్తి ప్రతిష్ఠలు దేశదేశాంతరములకు వ్యాపించెను. పలువురు మేధావులు, యోగులు, సిద్ధ పురుషులు, రాజకీయ నాయకులు, అర్థార్థులు, ముముక్షువులు వారి దర్శనార్థము వచ్చుచుండిరి. ఆ యోగి రాజు తమపై వర్షించు ప్రేమామృతధారలకు పరితృప్తులై అభీష్టసిద్ధినందుచుండిరి.

విశ్వయోగి దర్శనార్థము వచ్చిన ఒక సాధకుడు జిజ్ఞాసతో, స్వామి వారి పరిపూర్ణానుగ్రహమునకు పాత్రుడై, సదా వారి సన్నిధిలో జీవితము వెళ్ళ బుచ్చుకొనుచున్న విశ్వకుటుంబ సభ్యుడగు ఒక జ్ఞాన వృద్ధుని గాంచి, వినయ పూర్వకముగా నమస్కరించి, "స్వామీ! శ్రీ విశ్వయోగి విశ్వంజీ వారిని దర్శించ వలెనను కుతూహలముతో చాల దూరమునుండి వచ్చితిని. వారి మహిమలు వినుట యేగాని వారిని గురించి నాకేమియు తెలియదు. దయచేసి వారి చరిత్ర తెలిపి ధన్యుని గావించు"డని ప్రార్థించెను.

అప్పుడు జ్ఞానవృద్ధుడు సాధకునితో నిట్లనుచున్నాడు, "నాయనా! నా ప్రియస్నేహితుని చరిత్రయే నాకు తెలియదు. నా మనస్సే నాకు గోచరము కానున్నది. ఇట్టి స్థితిలో యోగీశ్వరుని చరిత్ర నేనెట్లు చెప్పగలను? మహాత్ముని లక్షణములిట్టివని నేనెట్లు వర్ణించగలను? యోగియైనవాడే యోగియొక్క జీవితమును గ్రహించగలడు. అట్టిచో వారి మహిమ యిట్టిదని నేనెట్లు పేర్కొనగలను? సప్తసముద్రముల లోతైనను కనుగొనవచ్చును, నీటినైనను మూట గట్టవచ్చును. ఆకాశపుష్పమునైనను

సాధించవచ్చును కాని యోగీశ్వరుల చరిత్ర చెప్పుట దుస్తరము. నీవు గురు భక్తితో, శ్రద్ధాసక్తులతో, జిజ్ఞాసతో అడుగుచున్నావు కావున విశ్వదత్త నాచే పలికించిన విధముగా చెప్పెదును. సావధానముగా వినుము.

"విశ్వయోగి ఎవరో కాదు. సాక్షాత్తు విశ్వదత్త. ఆనాడు ధర్మ సంరక్షణార్థము పరబ్రహ్మ అవతరించి, అత్రి దంపతులకు దత్తమైనాడు. ఈనాడు ఆయన విశ్వమునకు దత్తమై, నవసమాజ నిర్మాణము నవధరించి, ప్రతి వ్యక్తిని అత్రిగా చేయుటకై దీక్ష బూనినాడు. దత్తాత్రేయులవారు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల సమైక్యరూపము. భిన్నత్వములో ఏకత్వము జూపి, **"ఏకం సత్ విప్రాః బహుధా వదంతి"** యను సత్యమును చాటి చెప్పిన పరబ్రహ్మ తత్త్వము దత్తాత్రేయుడు. **"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ"** యని శ్రుతులు పలుకుచున్న జ్ఞానగమ్యమైన పరతత్త్వము దత్తాత్రేయుడు. ఆయన జ్ఞాన ప్రదాత. కావుననే ఏ అవతారమూర్తికి లేని **'గురుదేవ'** యన్న విశేషణమాయనకు కలిగి సార్థకమైనది. అన్ని అవతారముల లక్ష్యము, ధ్యేయము ఒక్కటే యైనను దత్తావతారము విలక్షణమైనది. ఏ ప్రయోజనార్థము అవతారము వచ్చెనో ఆ ప్రయోజనము తీరిన తరువాత ఆ అవతారము లోకమునుండి నిష్క్రమించును. రామకృష్ణాద్యవతారములన్నియు నట్టివే. దత్తావతారము దుష్ట శిక్షణకు గాక, దుష్టులను జ్ఞానబోధచే శిష్టులుగా మార్చునుద్దేశముతో నేర్పడినదగుటచే భువిపై జనులున్నంతవరకు ఆ అవతార ప్రయోజనముండక తప్పదు. కనుక అది నిత్య సత్యావతారముగా పరిగణింపబడినది.

"నాయనా! దత్తాత్రేయులవారు అనసూయాత్రి పుత్రులనుట పురాణ గాథ. **"ఇతిహాస పురాణాభ్యాం వేదాంతార్థ ప్రకాశ్యతే"** యను నట్లు పురాణము లందలి కథలన్నియు వేదాంతార్థమును ప్రకటించుచుండును. ఆ కథలను కథలుగా గాక ఆ కథలలోని పరమార్థమును మనము గ్రహించవలెను. **'అత్రి'** అనునది ఒక సంకేతము. అత్రి అనగా మూడు కాని వాడు లేదా మూడు లేనివాడు. ఒక వ్యక్తి సాధనా క్రమములో సత్వరజస్తమో గుణములకతీతమైన స్థితిని, స్థూల, సూక్ష్మ, కారణములనే మూడు పురములను (బ్రహ్మ, విష్ణు, రుద్ర గ్రంథులను) విచ్ఛేదము చేయు స్థితిని, అసూయలేని మానసిక సాహ చర్యముతో చేరుకున్నప్పుడు అతడు అత్రియగును. అట్టివానికి సృష్టి స్థితి లయ కారమైన మహాశక్తి దత్తమగును. దత్తాత్రేయుడనుటలో గల అంతరార్థమిదియే.

"తనలోని దివ్యశక్తిని సర్వత్రా వ్యాపించియున్న విశ్వశక్తితో అనగా వ్యక్తిగత మనస్సును విశ్వమనస్సుతో సంబంధము నేర్పరచుకొనుటయే యోగము. యోగము వలన దత్తము చేసుకొన్న శక్తి దత్త శక్తి. అదే దత్తాత్రేయుడు. ఇదే దత్త సంప్రదాయము. ఇదే సనాతన సంప్రదాయము. వ్యక్తి తనలోని శక్తిని జాగృతము జేసికొని, విశ్వశక్తితో శాశ్వత సంబంధము నేర్పరచుకొని, తానొక శక్తి స్వరూపముగా మారి విశ్వకళ్యాణ మొనరించుట సనాతన ధర్మము. భావసమైక్యతకు, భిన్నత్వంలో నేకత్వ సాధనకు దత్తోపాసన యెంతయో తోడ్పడును. విశ్వశక్తిని దత్తము చేసుకొన్న యోగులు దత్తావతారులుగా, సద్గురువులుగా పరిగణింపబడుచున్నారు.


"ఇప్పటికి దాదాపు ముప్పైఐదు సంవత్సరముల క్రిందట దత్తావతారులైన శ్రీ శ్రీధర మహారాజ్ ప్రియశిష్యులైన సమర్థ సద్గురు శ్రీ దత్తాత్రేయ మహరాజ్ ఆనాడు రామకృష్ణ పరమహంస వివేకానందునకు వలె మంత్ర ప్రదానముతో తమ శక్తినంతయు వారికి ధారపోసిరి. ఆనాటి నుండి ఇరువది యొక్క సంవత్సరములు వారు అచంచల దీక్షతో, నైష్ఠిక బ్రహ్మచర్యముతో, అహంకార మమకారములను వదిలి, తీవ్రాతితీవ్రమైన శోధన చేసి గ్రంథిత్రయ భేదన మొనర్చుకొని, చిచ్ఛక్తిని దత్తము చేసుకొని విశ్వయోగులై, నేడు విశ్వదత్తులైనారు. ఆ దత్తస్వరూపులు సదయులై ప్రసాదించిన **"ఓం శ్రీ సాయిరాం గురుదేవదత్త"** యను మంత్రము సర్వాభీష్టములను ప్రసాదించుచు భక్తులపాలిటి కల్పవృక్షమైనది. మహాత్ముని దివ్యనామము ఒక్కసారి స్మరించినంత మాత్రమున ఎటువంటి బాధలైనను పటాపంచలైపోయి, మనస్సుకు శాంతి చేకూరగలదు. వారు నివసించియున్న **'విశ్వమందిరము'** మనకు **'గురుస్థానము'**. శ్రీ విశ్వయోగి విశ్వంజీ వారు సాయిదత్తులు, విశ్వదత్తులు, సాక్షాత్తు **"గురుదేవదత్తులు".**

జ్ఞానవృద్ధుని పలుకులు విని, ఆ సాధకుడు శరీరము రోమాంచమంద, ఆమందానంద కందళిత హృదయారవిందుడై, అనన్యమైన భక్తితో, ఆ గురుమూర్తి తన ఎదుట సాక్షాత్కరించినట్లు దివ్యానుభూతిని పొందినవాడై తన్మయత్వమున నిట్లు స్తుతించెను :

**శ్లో॥ గురుమధ్యే స్థితం విశ్వం, విశ్వమధ్యే స్థితో గురుః ।**
**గురుర్విశ్వం నచాన్యోస్తి తస్మైశ్రీ గురవే నమః ॥**

**ఓం శ్రీం విశ్వదత్తాయ నమః । ఓం శ్రీ సాయిరాం గురుదేవదత్త ॥**

**ప్రథమాధ్యాయం సమాప్తం**



# ద్వితీయాధ్యాయం

సాధకుని గురు భక్తి పారమ్యమును జూచి, సంతోషించినవాడై ఆ గుణవృద్ధుడు అతనిని సాదరముగ ఆలింగనము చేసుకొని వాత్సల్య దృక్కులు ప్రసరించుచు, "నాయనా! నీపై విశ్వదత్త దివ్యానుగ్రహము సంపూర్ణముగా ప్రసరించుచున్నది. కావుననే ఆ సద్గురువు నాచే నిట్లు పలికించుచున్నాడు. నీవు ధన్యుడవు. నీ వలన గురు చరిత్రను స్మరించు భాగ్యము నాకు కలిగినది. దత్త సంప్రదాయములో గురువే పరబ్రహ్మ. గురువుకన్న పూజ్యమైనది మరొకటి లేదు. ఈ తత్త్వమును బోధించుటకే గురుగీత మొదలైన గ్రంథములు వెలసినవి.

**శ్లో॥ ధ్యాన మూలం గురోర్మూర్తిః పూజా మూలం గురోః పదం ।**
**మంత్ర మూలం గురోర్వాక్యం మోక్షమూలం గురోః కృపా ॥**

మనము గురు రూపమునే ధ్యానించవలెను. వారి పాదములనే పూజించ వలెను. వారి వాక్యమునే మంత్రముగా భావించవలెను. మోక్షమునకై వారి దయనే అర్థించవలెను.

**శ్లో॥ గంగా పాపం, శశి తాపం, దైన్యం కల్పతరుస్తథా ।**
**పాపం, తాపం, దైన్యంచ, హరతి శ్రీగురు దర్శనాత్ ॥**

నాయనా! గంగానది పాపమొక్కదానినే పోగొట్టగలదు. చంద్రుడు ఒక్క తాపమునే హరించగలడు. కల్పవృక్షము ఒక్క దైన్యమునే తొలగించగలదు. గురువును స్మరించినంత మాత్రమున పాపము, తాపము, దైన్యము మూడును క్షణములో

నశించగలవు. కావున సకల దేవతా స్వరూపముగా గురువును భావించి పూజించు చుండవలెను. శ్రీ కృష్ణుడు భగవద్గీతలో 'యోగులు నా హృదయ'మని చెప్పెను. యోగీశ్వరులకు భగవంతునకు భేదము లేదు. మానవులు తమ కర్తవ్యమును మరచి అధర్మాచరణులగుచున్నప్పుడు, ఆయా ప్రదేశములలో యోగీశ్వరులుద్భవించి, కర్తవ్యోపదేశము చేసి, జనులను సత్య మార్గమున పెట్టి, వ్యవహారములను చక్క బెట్టుదురు. ఆ సద్గురువులు దీపస్తంభములవలె మార్గదర్శకులై తోడ్పడి మనకు నడువవలసిన సన్మార్గములను, సత్ప్రవర్తనములను జూపింతురు. ఈ విధముగనే శ్రీ పాద శ్రీవల్లభులు, శ్రీ నరసింహ సరస్వతి, శ్రీ మాణిక్యప్రభువు, శ్రీ అక్కలకోట మహరాజ్, శ్రీ షిర్డిసాయిబాబా, శ్రీ వాసుదేవానంద సరస్వతి, శ్రీ ఏకనాథ్, శ్రీ సమర్ధరామదాసు, శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ అరవిందులు, శ్రీ రమణ మహర్షి, శ్రీ శ్రీధరస్వామి మున్నగువారు, ఇంకను పలువురు యోగులు, సిద్ధపురుషులు వేరు వేరు సమయములందు జన్మించి లోకులకు సన్మార్గము జూపిరి. ఆ విధముగనే శ్రీ విశ్వయోగి విశ్వంజీ వారు గూడ నేడు గుంటూరులో వెలసి, విశ్వదత్తులై విశ్వమానవ సమైక్యతకు దీక్షాబద్ధులైనారు. వారి బోధలు మనకు ఉభయ తారకములు. "మనుష్యుడు కారు వంటి వాడు. భగవంతుడు పెట్రోలు లాంటి వాడు. గురువు డ్రైవరు వంటి వాడు. గురువు పర్యవేక్షణలో, భగవంతునిపై విశ్వాసంతో, మనుష్యుడు జీవితాన్ని సఫలం జేసుకోవాలి," అని వారు తరచుగ చెప్పుచుందురు.

"ఆ సద్గురువెంతటి మానవతావాదియో, వ్యక్తిని సంస్కరించి, తద్వారా కుటుంబమును సంస్కరించినగాని సమాజాభివృద్ధి కలుగదని తత్కార్య సాధన కెంతగా తపించుచున్నారో, వారి మాటలు వినిన నీకే బోధపడగలదు వినుము."

"ఈ యావత్ప్రపంచములో దివ్యశక్తి ఒకటి నిండియున్నది. అదే అన్నిటిని త్రిప్పుచున్నది. అది సర్వ శక్తివంతమైనది. సర్వత్రా ఉన్నది. సర్వము తానేయైనది. అదే శక్తి ప్రతి ప్రాణిలోను, మనిషిలోను ఉన్నది. అదే శక్తి పరమాణువులో గూడా నున్నది. ఈ సత్యాన్ని మానవుడు గ్రహించక భగవంతుడు ఎక్కడో దూరంగా నున్నాడని పొరబాటు పడుతున్నాడు. తన తోటి మానవుల్లో దేవుడున్నాడని గ్రహించి, మనిషిని మనిషిగా ప్రేమించలేక పోతున్నాడు. పైగా ద్వేషిస్తున్నాడు. ఇలా ద్వేషించమని సనాతన భారతీయ ధర్మం ఎక్కడా చెప్పలేదు.'

"కుటుంబం సనాతనధర్మానికి మూలస్తంభం. వ్యక్తి వికాసం ద్వారా కుటుంబ వికాసం సాధించాలి. కుటుంబముల సమైక్య కృషి ద్వారా సమాజ వికాసాన్ని సాధించటమే సనాతన ధర్మ లక్ష్యం. ఈ నాడు వ్యక్తులు కుల మతాలపేరుతో పరస్పరం దూరమవుతున్నారు. వాళ్ళను ఆధ్యాత్మికత ద్వారా సంఘటితం చేయాలి. ఏకమనస్కులుగా తీర్చిదిద్దాలి. తద్వారా సమాజ వికాసాన్ని సాధించాలి. ఆధ్యాత్మికత వల్ల సమాజానికి మేలు కలగాలి.'

"మహిమలనేవి ఉన్నవా?" అని అడిగే వారిని చూచి ఆయన, 'మహిమలనేవి లేవు. జాగ్రత్తగా వినండి. శస్త్రవైద్య నిపుణుడైన డాక్టరు రోజూ కొన్ని వందల ఆపరేషన్లు చేస్తాడు. ఆ విధంగా కోటానుకోట్ల జనం చేయలేరు. చేయలేనివారికి అలా చేయడం ఒక వింతగాను, మహిమగాను అనిపిస్తుంది. ఆపరేషన్లు చేయడం నేర్చుకున్న డాక్టర్లకు అది సహజంగా కనిపిస్తుంది. అలాగే భగవత్ శక్తి వలన డాక్టరు ఆపరేషన్లు చేస్తున్నాడు. ఇంజనీరు అద్భుతంగా కట్టడాలు కడుతున్నాడు. మరొకడు మరొకటి చేస్తున్నాడు. మన దృష్టికి అది మహిమ. అది వారికి సహజం. మన మనస్సుకు అలాంటి శిక్షణ యిస్తే మనమూ అలా చేయవచ్చు. శక్తి పదార్థంగా మారుతుందని భౌతికశాస్త్రం అంగీకరిస్తున్నది. భౌతిక పదార్థములను మనోశక్తిచేత యోగులు ఉత్పత్తి చేయగలరు. చెట్టు బొగ్గుపులుసు వాయువును గ్రహించి సూర్యరశ్మితో కొయ్యను తయారు చేసుకొనుచున్నది. అట్లే యోగులు తమ చుట్టూ ఉండు గాలిని ఉపయోగించి, మనోశక్తితో కోరిన పదార్థములను మొదట సూక్ష్మావస్థలోను, తరువాత స్థూల రూపంలోను నిర్మించగలరు. మనోశక్తి చాలా ప్రభావం గలది. మంత్రం మనిషిని మహాశక్తి కేంద్రంగా మారుస్తుంది. **ఓం శ్రీ సాయిరాం గురుదేవ దత్త** అనే మంత్రాన్ని అందరూ నియమ నిష్ఠలతో ఉపాసించండి. లేదా మీకిష్టమైన మరొక మంత్ర జపం చెయ్యండి, అని బోధిస్తారు.

"నాయనా! వారి బోధలు వేదాంతమును నేటి శాస్త్రీయ దృక్పథముతో సమన్వయించి ఎట్లు చూపుతున్నదో తెలసినది గదా! వారు తరతరాలకు పనికి వచ్చే దివ్య సందేశాలను తరగనిగనివంటి తమ హృదయమునుండి తీసి అందించుచున్నారు. 'దేహమే దేవాలయం దయ గల హృదయమే దైవమందిరము', 'సత్యం, శీలం, పవిత్రత, ఐక్యత అనునవి సనాతన ధర్మమునకు మూలస్తంభాలు', 'ఆత్మ నిగ్రహం, ఆత్మ విశ్వాసం, ఆత్మ త్యాగం అనేవి ఆత్మ సాక్షాత్కారానికి దారి చూపును', 'తల్లి

దం(డులను ఉపేక్షిస్తే దేవుడు దొరకడు', 'అదుపు పొదుపు పాటించు', 'రాముడన్నా, రహీమన్నా, యెహోవా అన్నా, నానక్ అన్నా ఒకడే!', 'మనదంతా ఒకే కులం. అది మానవ కులం. మనదంతా ఒకే మతం. అది (పేమ మతం', 'పరిపూర్ణ మానవత్వమే దైవత్వం' ఈ మొదలైన వారి సూక్తులు మనహృదయపేటికలో భద్రపరచుకొనదగినవి.

"మానవుడైన వాడు ఎట్లా ఆచరించాలో అట్లా ఆచరించి చూపుటే వారి లక్ష్యము. కుల, మత రహితముగా మానవులనందరిని సమైక్యపరచుటయే వారి ధ్యేయము. మనిషిని మనిషిగా, మహామనీషిగా తీర్చిదిద్దవలయునన్నదే వారి సాధన. అందుకై వారెంచుకొనిన మార్గము విలక్షణమైనది. తమదగ్గరకు వచ్చెడి (పతి వ్యక్తిని వారు (పేమతో లాలించి, బుజ్జగించెదరు. ఎటువంటి వాడైనను వారి (పేమకు లోబడక తప్పదు. ఒక్కొక్కప్పుడు ఉక్కుకన్న కఠినముగా నున్నట్లు కనిపించినను వారి హృదయము (పేమభరితము. మనలను సంస్కరించుటకు వారు కోపముతో నున్నట్లు కనిపింతురే గాని, వారు భక్తులను తిరస్కరించిన క్షణమొక్కటైనను లేదు. వ్యక్తి సంస్కరణము ద్వారా సమాజమును బాగు చేయవలయునన్నదే వారి తపస్సు. తనను దేవుడని, అవతార పురుషుడని చెప్పువారలనుద్దేశించి, 'దేవుణ్ణి కాదు. దేవుడి సేవకుణ్ణి, మీలాగే రెండు కాళ్లు, రెండు చేతులు ఉన్న మానవుణ్ణి. మనిషి మనిషిలా (బతకాలని తాప(తయ పడుతున్న పిచ్చివాణ్ణి', అని వారు పలుకుదురు.


"బాలన్మోత్త పిశాచము వలె మెలగుచున్న ఆ మహాత్ముని చూచి సామాన్య మానవుడని (భమపడరాదు. (బహ్మ, విష్ణు, శివాత్మకమైన పర(బహ్మ స్వరూపముగా వారినెంచవలయును. మన పూర్వ పుణ్య విశేషము వలన మనకిట్టి సద్గురువు లభించినాడు. ఆయన సన్నిధి మనకొక పెన్నిధి. ఎన్ని మతసంబంధమైన ఉపన్యాసములు వినినప్పటికి పొందనట్టిది, ఎన్ని మత(గంథములు చదివినను తెలియనట్టిది యగు ఆత్మ సాక్షాత్కారము వారి (పాపకమువలన మనము సులభముగా పొందవచ్చును. నక్ష(తములన్నియు కలిసినను ఇవ్వలేని వెలుగును సూర్యుడెట్లు ఇవ్వగలుగుచున్నాడో, అట్లే మతోపన్యాసకులు, మత (గంథములు ఇవ్వలేని జ్ఞానమును క్షణములో మనకు సద్గురువు (పసాదించగలడు. వారి వైఖరి, వారి సంభాషణలే రహస్యముగా మనకు సలహాలనిచ్చును. క్షమించుట, ఫలాపేక్ష లేకుండుట, దానము చేయుట, ధర్మము పాటించుట, శరీరమును, మనస్సును స్వాధీనము నందుంచుకొనుట, అహంకారము లేకపోవుట, నిత్య సంతుష్టులైయుండుట మొదలగు


శుభలక్షణములు వారి పవిత్ర జీవితమునుండి వారనుసరించు చున్నప్పుడు భక్తులు కనిపెట్టుదురు. ఇది భక్తులకు వెలుగునిచ్చి పారమార్థికమునకు లేవనెత్తును. ఆ సద్గురువు మనకు దీపస్తంభము వంటి వాడు. మార్గదర్శకులు. వారి బోధలను విని, మనము బాగుగా అర్థము చేసుకొని, ఆచరణలో పెట్టినప్పుడే మనము నిజమైన శిష్యవర్గముగా, విశ్వ కుటుంబ సభ్యులముగా పరిగణింపబడుదుము", అని గుణవృద్ధుడు పలుకగా ఆ సాధకుడు భక్తి పారవశ్యముతో కన్నులు మూసుకొని, హృదయపూర్వకముగా విశ్వదత్త నిట్లు స్తుతించి, నమోవాకముల నర్పించెను.

**శ్లో॥ అజ్ఞానాంధ వివస్వంతం బ్రహ్మ విష్ణు శివాత్మకం ।**
**ఆత్మానందప్రదం బుద్ధం విశ్వదత్తం నమామ్యహం ॥**

**ఓం శ్రీం విశ్వదత్తాయ నమః । ఓం శ్రీ సాయిరాం గురుదేవదత్త ॥**

**ద్వితీయాధ్యాయం సమాప్తం**





# తృతీయాధ్యాయం

గుణవృద్ధుడిట్లనుచున్నాడు, "నాయనా! సాధనద్వారా మానవుడు దివ్యత్వము నెట్లు సంపాదించు కొనవచ్చునో భగవద్గీత వివరించిన విధముగనే మానవుడు తన మనస్సును విశ్వ మనస్సుతో కలిపి, విశ్వశక్తిని దత్తము చేసికొని దత్తాత్రేయ స్వరూపముగా నెట్లు మారునో శ్రీ విశ్వయోగి విశ్వంజీ సద్గురు మహరాజ్ జీవితము మనకు వెల్లడించును. ఆత్మ సాక్షాత్కారము కోరువాడు మునుముందు తన్ను తాను సంస్కరించు కొనవలసిన అవసరమెంతైన నున్నది. త్యాగము, బ్రహ్మచర్యము, నిస్వార్థము, నిష్కామము మున్నగు సాత్విక గుణములను ప్రోదిచేసుకొని సంరక్షించు కొనుచుండిననే గాని ఆత్మసాక్షాత్కారము లభించదు. మురికి గుడ్డకు రంగు అద్దినచో అంటుకొనదు. దుమ్ము పేరుకొనిన అద్దములో చూచిన ముఖము కనిపించదు. పరిపూర్ణ మానవత్వము సాధించనిది, త్రికరణశుద్ధి లేనిది దైవత్వము సిద్ధించదు. ఏకాగ్రత లేక, మనస్సును స్వాధీనము జేసికొనక ఎన్ని కోట్లు జపము చేసినను, ఎన్ని పూజలు చేసినను, ఎన్ని తీర్థములలో మునిగినను ఫలితముండదు. యోగ్యత సంపాదించుకొన్న వ్యక్తికి యోగము సిద్ధించును. ఏ యోగి చరిత్ర చూచినను, ఏ సిద్ధ పురుషుని చరితము పరికించినను ఈ సత్యమే గోచరించును. శ్రీ విశ్వంజీ జడ్చర్లలో శ్రీ దత్తాత్రేయ మహరాజ్ దగ్గర ఉపదేశము పొందిన నాటినుండి ఇరువదియొక్క సంవత్సరములు తీవ్రాతి తీవ్రముగా, నైష్ఠిక బ్రహ్మచర్యముతో, అహంకార మమకారములను వదలి సాధన చేసిరి. క్రైస్తవ మత గ్రంథమైన బైబిలును, మహమ్మదీయ మత గ్రంథమైన ఖురానును చక్కగా అధ్యయనము చేసి, ఆయా

మతాను సారముగా, రామకృష్ణ పరమహంస వలె ఉపాసన చేసి, 'అన్ని మతముల సారమొక్కటే! భగవంతుడొక్కడే!' నన్న సత్యమును సందర్శించిరి. వారి యోగ సాధనలో అనేక దర్శనములతోబాటు అత్యద్భుతమైన అలౌకిక శక్తులు వారికి కలిగినవి.

ఒక సమయమున వారు సత్యసాయిబాబా జన్మదినోత్సవ వేడుకలు చూచుటకై పుట్టపర్తికి పోయిరి. అచ్చట పూర్వాశ్రమములో తమ మేనల్లుడైన పెళ్ళూరి ఆంజనేయులుగారింటిలో దిగిరి. సాయంకాలము ఆ ఇంటి డాబామీదకు పోగా, పిట్టగోడపై ఒక పూల కుండి వారికి కనిపించినది. అది అక్కడయున్నచోనెవరి నెత్తిపైనను జారిపడగలదని భావించి, ముందు జాగ్రత్త చర్యగా, దానిని పట్టుకొని క్రిందికి దింపుచుండిరి. ఆ కుండీ చేతుల నుండి జారి, వారి కాలిపైబడి, బొటనవ్రేలు చితికి రక్తము ధారాపాతముగా కారసాగెను. కాలికి కట్టు కట్టించుకొని పదిరోజులు వారు కాలు కదల్చుటకు గూడ వీలులేక చాల బాధపడిరి. ప్రశాంతినిలయమునందలి కార్యక్రమములు చూచుటకు పోవలయునన్న ఆయనను ఇద్దరు పట్టుకొని తీసుకొని పోవలసివచ్చెను. ఆ దెబ్బ వలన వారి కుడికాలి బొటన వ్రేలియందు గల సుషుమ్నా నాడికి చలనము సంభవించి, అద్భుతమైన రీతిలో కుండలిని జాగృతమైనది. అది వారి జీవితమును మలుపు త్రిప్పిన అద్భుతమైన ఒక దివ్యసంఘటన. అది జరిగిన కొన్ని దినములకే మరియొక విచిత్రము జరిగినది.

"ఒకనాడు ధ్యానములో నుండగా దిగంబరియైన ఒక దివ్య సుందరి వారికి ప్రత్యక్షమైనది. వారినామె కౌగిలించుకొని, శరీరమునందంతయు చుంబించుచు, రక్తము కారునట్లు గోళ్ళతో శరీరమును రక్కసాగినది. విశ్వంజీ వారి ధ్యాననిష్ఠ సడలలేదు. ఆ రమణీమణి వారిని అంతరిక్షములోనికి చాలా దూరముతీసుకొని పోయెను. ఆమె ఎంత ప్రయత్నించినను వారి ఏకాగ్రత చెడలేదు. ఆమె యత్నములన్నియు నిష్ఫలములయ్యెను. అప్పుడామె విశ్వంజీ స్థైర్యమును, జితేంద్రియత్వమును మెచ్చుకొని, దివ్యవస్త్రాభరణ కిరీటభూషితురాలై, 'నీ మానసము విశ్వమానసముతో లగ్నమైనది. నీవు విశ్వయోగివైతివ'ని శ్లాఘించెను. 'నీ ఆత్మశక్తి విశ్వశక్తితో శాశ్వత సంబంధము నేర్పరచుకొన్నది. నీ మనస్సు విషయేచ్ఛలయందు తగుల్కొనదని తేలిపోయినది. నా ఆకర్షణకెవరు లొంగరో, వారికి నేను స్వాధీనమై దత్తమవుదును. నీకు స్వాధీనమైన విశ్వశక్తిని నేను. నీ దత్తశక్తిని నేను,' అని పలికి ఆమె విశ్వంజీలో కలిసిపోయెను. ఆ క్షణమే విశ్వంజీ శ్రీ విశ్వయోగిగా నూతన

జన్మనెత్తినారు. పాత జీవితము మరణించినది. కొత్త జీవితము ప్రభవించినది. మామూలు పాంచభౌతిక శరీరము యోగ శరీరముగా మారినది. ఒక మానవశక్తి ఒక మహాయోగశక్తిగా లోకహితార్థము భువిపై పరిణామము చెందినది. నాయనా! ఆ దిగంబరి ఎవ్వరో కాదు. దిగంబరావధూతయైన దత్త ప్రభువు యొక్క శక్తి స్వరూపము! ఆ దేవి నిర్దేశించిన భవిష్యత్ కార్యక్రమము ప్రకారము వారు వ్యక్తి సంస్కారము ద్వారా విశ్వమానవ సమైక్యత సాధనకు కృతనిశ్చయులైనారు.

“ఒకసారి ఆయన అమ్మ దర్శనార్థము జిల్లెళ్లమూడి పోయిరి. ఈ విశ్వదత్తను చూచి, ఆ అనసూయామాత పట్టరాని వాత్సల్యముతో దగ్గరకు తీసుకొని, ముద్దుపెట్టుకొని, మనసారా మూడు ముద్దల అన్నము నోటిలో పెట్టి తినిపించినది. ముద్దముద్దకు వారి శరీరములో నూతనోత్తేజము పరవళ్ళు త్రొక్కసాగినది. అమ్మ పెట్టినది అన్నపు ముద్దలు కావు. జ్ఞాన కళికలు. చిచ్ఛక్తి స్వరూపమైన అమ్మ ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తులు అను శక్తిత్రయమును వారిలో ప్రవేశపెట్టెను. ఆ శక్తి ప్రసారముతో వారి హృదయమునుండి భవ్యదివ్య కవితావేశము పెల్లుబికినది. వారి ఆత్మ సాక్షాత్కారమునకు అద్దము పట్టినట్లుగా దివ్యభావసుగంధ బంధురమైన **‘అనురాగలహరి’** కావ్యము వెలువడినది.

‘వారి సాధనా దశలో ఎందరు యోగులు, ఎందరు సిద్ధులు, ఎందరు అవతార పురుషులు ప్రత్యక్షముగా, పరోక్షముగా వారికి తమ శక్తి ధారపోసిరో? ఎందరు దేవతలు కరుణించి ఆశీస్సులు కురిపించిరో? అత్యద్భుతమైన శక్తులు వారికి కలిగినవి. స్వహస్తముతో వారు ప్రసాదించు విభూతి వ్యాధుల పాలిటి వజ్రాయుధమైనది. వారి వాక్కు వేద వాక్కు అయినది. వారి హృదయము ప్రేమామృతపూర్ణమై భక్త హృదయాకర్షకమైనది. ఎందరెందరో, ఎన్నెన్నో సమస్యలతో సతమతమగుచు వచ్చి దర్శనమాత్రముననే పరిష్కారము పొంది, శాంత చిత్తులై, సంతుష్టులై వెడలిపోవుచుందురు. వారు దయతో అనుగ్రహించిన **‘ఓం శ్రీ సాయిరాం గురుదేవ దత్త’** అను మంత్రము భక్తుల పాలిటి చింతామణియైనది.

“విశ్వంజీ విశ్వయోగిగా మారిన విషయము మొట్టమొదటగా కనుగొన్న వారు జమ్మలమడక మాధవరామ శర్మగారు. మొదటినుండియు వారు శ్రీ విశ్వంజీపై పుత్రవాత్సల్యము వెల్లడించుచుండెడివారు. సాధనా దశలో అప్పుడప్పుడు విశ్వంజీ

ఆయన కడకు పోయి తమకు కలిగిన సందేహములను తెలిపి తీర్చుకొనుచుండెడివారు. ఆ బ్రాహ్మీమయమూర్తి శ్రీ విశ్వంజీలో దినదిన ప్రవర్ధమానమగుచున్న యోగశక్తిని దర్శించుచు ముదమందుచుండిరి. క్రమక్రమముగా ఆయనకు విశ్వంజీ యెడ గౌరవాభిమానములు, పూజ్య భావము కలిగెను. ఆ తరువాత చందోలు శాస్త్రిగారుగా ప్రసిద్ధికెక్కిన బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రి గారు, శ్రీరామశరణ్ కుందుర్తి వెంకటనరసయ్యగారు మొదలైనవారు విశ్వంజీలో దత్తాత్రేయ శక్తిని దర్శించిరి.

"మాధవశర్మగారికి వారి జీవిత చరమదశలో ఒక దృష్టాంతమైనది. కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారు కలలో వారికి కనిపించిరి. అప్పుడు శర్మగారు శ్రీస్వామి వారు లోగడ తమకు ప్రసాదించిన శ్రీచక్రము, శంఖము తాము పూజించుటకు అశక్తులగుటచే వాటినెవరికిమ్మందురని ప్రశ్నించెను. శ్రీ స్వామి వారు విశ్వంజీని చూసి, "ఆ దత్త మూర్తికి వానిని దత్తము చేయు" మని చెప్పిరి.

"మరునాడు వారికి మరియొక దృష్టాంతమైనది, వారికి విశ్వంజీ ఆరు మీటర్ల శ్వేతశస్త్రమును ప్రదానము చేసిరి. అది చూచి శ్రీశర్మగారు తమ అంత్యకాలము సమీపించినదనుటకు అదియొక నిదర్శనమని భావించి తమ దగ్గరకు వచ్చిన శ్రీమతి కల్పనకు, మరియు శ్రీ ఆకుల కోటేశ్వరరావు గారి ధర్మపత్ని యైన శ్రీమతి కామేశ్వరికి శంఖము, చక్రమునొసగి వానిని శ్రీ విశ్వయోగికి తామిచ్చినట్లు చెప్పి యొనగుడని పలికెను. ఈశ్వరికి శ్రీ చక్రము వారి నుండి అందుకొనుచున్నప్పుడు అది బరువుగా వేడిగా నున్నట్లనించెను. క్రమముగా ఆ వేడి శరీరములోనికి పాకుచున్నట్లనిపించెను. అవి తీసుకొని వారు రైలుపేటకు పోయి, అచ్చట విశ్వమందిరములోనున్న విశ్వయోగికిచ్చిరి. వారి దగ్గరనుండి అవి అందుకొనుచుండగా విశ్వయోగి ముఖము కందినట్లయెను. వారు వాటిని పీఠముపై నుంచి, వెంటనే బావి దగ్గరకు పోయి, ముప్పది నలుబది బక్కెట్లు నీరు తోడుకొని తలపై పోసుకొనిరి. ఆ పిదప ఎఱ్ఱని ఉత్తరీయము ధరించి, పూజాగృహములోనికి వచ్చి శ్రీ శర్మగారిచ్చిన శ్రీచక్రము, శంఖమును పూజించి హారతి యిచ్చిరి. శ్రీ దత్త స్వరూపులైన శ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతి స్వామివారు తమ శ్రీ చక్రము ద్వారా తమ శక్తిని భవిష్యత్ కార్యక్రమమునకై విశ్వయోగిలో ఇట్లు ప్రవేశపెట్టిరి.

“శ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారు శ్రీ విశ్వయోగిలో తమ ఆరాధ్య దైవమైన దత్తప్రభువును దర్శించిరి. విశ్వమందిర కుటుంబ సభ్యులు నిర్వహించు కార్యక్రమములలో తరచుగా వారు పాల్గొనుచుండెడి వారు. విశ్వయోగికి వారనిన ఎంతయో గౌరవము. పూజ్య భావములుండెడివి. ఒకరోజు ఆయనను విశ్వమందిరము నకు తోడుకొని వచ్చి, తాము నిత్యము ఆసీనులై, భక్తకోటిననుగ్రహించుచున్న పీఠముపై వారిని కూర్చుండబెట్టి, తాము వారి పాదముల ముందు నేలపై విశ్వయోగి కూర్చుండిరి. అది చూచి శాస్త్రిగారు, ‘మీరు క్రిందనే కూర్చున్నారు’, అన్నారు. విశ్వయోగి చిరునవ్వు నవ్వుచు, ‘నేను కుర్చీలోనే కూర్చున్నాను గదా!’ యనిరి. ఆ మాటలు విని శాస్త్రిగారు తృప్తిగా నవ్విరి. మహానుభావుల భాషణములు విచిత్రములై, దివ్యతత్వార్థ బోధకములై యుండును. ఆ మహనీయుల మాటలు వారి అద్వైత స్థితిని వెల్లడించునవిగా యుండెనని ఆ సంభాషణ విన్నవారు భావించిరి. శ్రీ శాస్త్రిగారి చివరి రోజులలో, వారిని చూచుటకై వెళ్ళి విశ్వయోగి ఆయన ఆశీస్సులనర్థించెను. ఆయన నవ్వి, ‘నా మీద దయతో మీరిక్కడకు వచ్చారు. నేను మీకు ఆశీస్సులివ్వటమా! దత్త స్వరూపులు మీరు. మీరే అందరికి ఆశీస్సులివ్వాలి’, అని అంజలి ఘటించిరి.

“డాక్టర్ కరణ్‌సింగ్, శ్రీ ప్రజ్ఞానంద స్వామి, శ్రీ సాయిపాదరేణు మహాభాష్యం రంగాచారి, శ్రీ విద్యారణ్యతీర్థ, జగద్గురు శ్రీ జయేంద్ర సరస్వతి మున్నగు మహా మహులెందరో, ‘విశ్వయోగి దత్తావతారమ’ని లోకమునకు చాటిరి. సమర్థుడు సద్గురువుగా లభించుట మన పూర్వజన్మ సుకృత’ మని పలుకగా సాధకుడు కన్నులు మూసుకొని భక్తి ప్రపత్తులతో అంజలిబద్ధుడై విశ్వదత్తనిట్లు స్తుతించెను –

**అవధూతం మహాత్మానం సచ్చిదానంద విగ్రహం ।**
**అనంత మహిమోపేతం విశ్వదత్తం నమామ్యహం ॥**

**ఓం శ్రీం విశ్వదత్తాయ నమః । ఓం శ్రీ సాయిరాం గురుదేవదత్త ॥**

**తృతీయాధ్యాయం సమాప్తం**



# చతుర్థాధ్యాయం

సాధకుడు గుణవృద్ధుని గాంచి, "స్వామీ! విశ్వదత్త లీలలు అద్భుతములై విని నకొలది మరింత వినవలయునను తృష్ణ జనించుచున్నది. ఆత్మ సాక్షాత్కారము పొందిన పిదప సమాజ శ్రేయస్సుకై ఇట్లు పాటుబడెడు వారు చాల అరుదు. విశ్వదత్తయనెడి పేరు వారికి సార్థకమైనది. మరికొన్ని విశేషములు దయయుంచి తెలుపు"దని ప్రార్థించెను. అప్పుడు గుణవృద్ధుడిట్లనెను.

**"విశ్వదత్తమహిమ వివరించ కష్టమ్ము**
**అవనిపైని నరున కెవనికేని,**
**విభుద వరుల వలన విన్నంత కన్నంత**
**తెలియ వచ్చినంత తేటబరతు."**

"గుంటూరు సమీపమున గల చముళ్ళమూడి వారి స్వగ్రామము. ఆయన 1944 సంవత్సరము మార్చి 5వ తేదీన గుంటూరులో జన్మించిరి. తల్లిదండ్రులు వరలక్ష్మమ్మ, ఆంజనేయులుగార్లు. శ్రీ నరసింహ సరస్వతీ స్వామి జనించిన వాజసనేయ (యాజ్ఞవల్క్య) శాఖలోనే వారును జన్మించిరి. వారిది శ్రీవత్స గోత్రము. తండ్రిగారు గుఱ్ఱప్పడియ ఆంజనేయులు గారు మహా తపస్వి. దత్తప్రభువు వారికి స్వప్నములో దర్శనమిచ్చి తారక మంత్రము నుపదేశించిరి. వారు మహా కవులు. పరమ నైష్ఠికులు ఒకసారి ఆయన కారణాంతరములవలన కాశికి పోయి అచ్చట కొన్నాళ్ళు నివసించిరి. ఒకనాటి రాత్రి ఆయనకు విశ్వనాథ జ్యోతిర్లింగము నుండి కాంతి పుంజములు

వెలువడుచున్నట్లు దృష్టాంతమయ్యెను. సరిగా ఆసమయములోనే గుంటూరులో తమకు పుత్రుడు కలుగుట వలన ఆ శిశువునకు **విశ్వనాథ శాస్త్రి** యను పేరు పెట్టిరి. అందరును **విశ్వ** మని పిలువజొచ్చిరి. శైశవములోనే ఆయన తన లీలలు ఎన్నో ప్రదర్శించెను. ఉయ్యాలలో పండుకొనబెట్టిన శిశువు నేలపై శయనించి యుండుట, ఒక గదిలో పరుండబెట్టిన శిశువు మరియొక గదిలో కనిపించుట చూచి తల్లిగారు ఆశ్చర్యపడుచుండెడిది. ఎవరైనను ఆ పిల్లవానిని అచ్చట పడుకొనబెట్టి యుండవచ్చని తలచుచు సమాధాన పడుచుండెడిది.

"ఒకసారి ఆమె తన కుమారుడు ధ్యానము చేసుకొనుచున్నప్పుడు గదిలోనికి తొంగి చూడగా, పీటమీద కూర్చున్నవాడు పీటమీద యుండక పీటపై ఒక మీటరు ఎత్తున శూన్యములో పద్మాసనము వేసుకొని యుండుట కని ఆమె వెరగందెను. కొన్ని నిమిషములకు ఆయన క్రిందికి దిగి, పీటపై కూర్చున్న తరువాత ఆమె గట్టిగా ఊపిరి పీల్చుకొనెను. గురువుగారినుండి మంత్రోపదేశము పొందక పూర్వము ఇట్టి మహిమలు ఆయన చూపెను. ఆయన చేతితో ఇచ్చిన భస్మము ఆ కాలములోనే బాధలను తొలగించుచుండెడిది.

"విశ్వంజీ ఉపాధ్యాయ వృత్తిలోనున్నప్పుడు ఒకసారి తమ సహోధ్యాపకుడైన అయ్యన్న మాష్టారును వెంటదీసుకొని పుట్టపర్తి వెళ్ళిరి. అక్కడ విశ్వంజీకి జ్వరము వచ్చెను. మూడు రోజులు జ్వరముతో బాధపడిరి. ఆ జ్వరములోనే ఒకరోజు ప్రశాంతినిలయములోనున్న ఫలహారశాలకు పోయి మజ్జిగ త్రాగిరి. వెంటనే వాంతియయ్యెను. వాంతిలో రక్తము పడుట చూచి అయ్యన్నగారు భయపడిరి. అప్పుడు విశ్వంజీ, 'భయములేదు. ఎవరికో ఇది జరుగవలసి యున్నది. నన్ను నమ్ముకొన్నవారి బాధ నేను స్వీకరించక తప్పదుగదా!' యని పలికిరి. 'ఇది ఎవరి కర్మమో మనకెట్లు తెలియును?' అని అయ్యన్నగారనగా శ్రీ విశ్వంజీ, 'మనము గుంటూరు వెళ్ళిన తరువాత అంతయు నీకే బోధపడగల' దని చెప్పిరి.

"రెండు రోజులచ్చట యుండి విశ్వంజీ గుంటూరుకు వచ్చిరి. మరునాడు వారి గదికి ఒకాయన వచ్చి, "మూడు రోజుల క్రితం మా ఇంటికి ఒక వ్యక్తి వచ్చి, మీ గురువుగారెవరు? మీరే మంత్రముపాసించుచున్నారు? ఎవరో నా దగ్గరకు వచ్చి మీకు చేతబడి చేయమని కోరగా అట్లు చేసితిని. కాని అది మీమీద పనిచేయక

నాకు త్రిప్పికొట్టినది. నాకు రక్తవాంతులగుచున్నవి. మీ మంత్రశక్తితో నన్ను రక్షించు"దని ప్రాధేయపడెను. నాకు ఆశ్చర్యము వేసినది. 'నాకేమియు మంత్రములు, తంత్రములు తెలియవు. కాని నేను ప్రతిరోజు రైలుపేట మాస్టరుగారి దగ్గరికి వెళ్లి వచ్చుచుందును', అని ఆయనతో చెప్పితిని. అప్పుడాయన, నన్ను మీ మాస్టారు దగ్గరకు తీసుకొని పొండు. ఆయనను వేడుకొనె'దనని ప్రతిరోజు వచ్చి నా ప్రాణము తీయుచున్నాడు. మీరనుజ్ఞనిచ్చిన ఆయనను మీదగ్గరకు తీసుకొని వచ్చెద'నని ఆ వ్యక్తి విశ్వంజీకి విన్నవించెను. విశ్వంజీ తమ ప్రక్కనున్న అయ్యన్నగారివైపు చూచి నవ్విరి. అయ్యన్నగారికి అంతయు అద్భుతముగా నుండెను. తరువాత విశ్వంజీ తమకడకు వచ్చిన ఆ చేతబడి చేసిన వ్యక్తిని మందలించుచు, 'ఆర్జించిన శక్తితో లోకహితమునకై పాటుబడవలయునుగాని నాశనమునకై ప్రయత్నించిన ఇట్టిగతియే పట్టు'నని బుద్ధి చెప్పి పంపివేసిరి.

"భక్తుల వ్యాధులెన్నింటినో విశ్వయోగి తాము గ్రహించి ఉపశమనము కలిగింతురు. డాక్టర్లకు లొంగని వ్యాధులను భస్మముచేత పోగొట్టుదురు. సంతానము కలుగదన్నవారికి సంతానము కలుగునట్లు చేయుదురు. ప్రఖ్యాత పారిశ్రామికవేత్త శ్రీ జి. రామారాయుడు గారిని వారు వ్యాధినుండి రెండు సార్లు కాపాడిరి. శ్రీ మాధవపెద్ది రాధాకృష్ణమూర్తి గారికి, శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారికి సత్యసాయిగా, మరి కొంత మందికి శ్రీరాముడిగా, దత్తుడుగా, శ్రీ షిర్డిసాయినాథుడుగా, జిల్లెళ్ళమూడి అమ్మగా ఇట్లనేక రూపములతో దర్శన మొసగిరి. హైదరాబాదులో నివసించుచున్న సుప్రీంకోర్టు న్యాయవాది నరసింహారావుగారికి విశ్వయోగియనిన ప్రాణము, శ్రీ విశ్వయోగి సాక్షాత్తు శ్రీ దత్తాత్రేయుడని వారి ప్రగాఢ విశ్వాసము.

"కొందరు భక్తుల యిండ్లకు వేరొక శరీరము ధరించి శ్రీ విశ్వదత్త వెళ్ళిన సందర్భములనేకములన్నవి. పొన్నూరు సమీపమునగల నండూరులో నివసించెడి సాయిబాబా భక్తురాలైన పూలమ్మగారితో ప్రతి గురువారము సాయంత్రము వారు సంభాషించుచుండెడివారు. ఇది ఆనాడు పూలమ్మ గారు అందరితోడను చెప్పిన మాట. ఒక రోజు ఆమె జ్వరము వచ్చి లేవ లేక నీరసముగా మంచముపై పరుండియుండెను. ఆరోజు గురుపూర్ణిమ. బాబాగారి ఊరేగింపు తమయింటి ముందుకు వచ్చినప్పుడు కొబ్బరికాయ కొట్టి హారతి ఇవ్వలేకపోవుచున్నాను గదాయని ఆమె విచారించుచు విశ్వయోగిని స్మరించెను. వెంటనే విశ్వయోగి ఆమె దగ్గరకు

వచ్చి మంచము ప్రక్కనయున్న కుర్చీలో కూర్చుండిరి. ఆమె నుదుటిపై భస్మము రాసి, కొంత నోటిలో వేసి, ఏం ఫరవాలేదు. జ్వరం తగ్గుతుంది గాని, ఊరికే కంగారు పడక. ఒక పావు గంట కళ్ళు ముసూకుని పడుకో. హారతి యిచ్చే శక్తి వస్తుంది', అని చెప్పి అదృశ్యమైరి. ఒక పావుగంటలో ఆమెకు చెమటలు పట్టి విచిత్రముగా జ్వరమంతయు తగ్గిపోయెను. బాబాకు స్వహస్తములతో ఆమె హారతి యిచ్చెను. పూలమ్మగారి దగ్గరకు విశ్వయోగి పోయిన సమయంలో వారు అన్నా శ్రీనివాసరావు కళ్యాణ మంటపమునందు ఉదయము తొమ్మిదినుండి రాత్రి తొమ్మిది వరకు గురుపౌర్ణమీ  కార్యక్రమ నిమగ్నులై యుండుట వందల కొలది మంది చూచిన ప్రత్యక్ష సాక్ష్యమున్నది. ఇట్లే రంగారెడ్డి జిల్లా జడ్జి శ్రీ దత్తాత్రేయ గారింట్లో రేపు విజయదశమి యనగా నవమి నాటి రాత్రి విశ్వయోగి దర్శనమిచ్చిరి. వారిని ఆయనయే గాక ఆయన సతీమణి, కుమారుడు కూడా దర్శించిరి. ఆ అద్భుతా నందములు పట్టలేక వెంటనే ఆయన బయలుదేరి, విజయదశమి ఉదయమునకు గుంటూరుచేరి, విశ్వయోగిని దర్శించి, రాత్రి తాము పొందిన దివ్యానుభవమును వెల్లడించిరి. ఇట్లెందరికో వారు దర్శనమిచ్చుచున్నారు.

తాడికొండ విద్యా సంస్థల వ్యవస్థాపకులైన విద్వాన్ గోగినేని కనకయ్య గారికి విశ్వయోగిపై గల భక్తి శ్రద్ధలు అపారము. ఎందరెందరికో వారు విశ్వయోగి పరిచయభాగ్యమును కలిగించిరి. గిరిజవోలు పాండు రంగారావు వంటి హేతువాదులెందరో వారి అమృత స్పర్శకు, ప్రేమార్ద్ర వీక్షణములకు లోబడి దాసోహమగుచున్నారు. ఇంతకన్నను ఆయన మహిమకు నిదర్శనమేమి కావలయు"నని గుణవృద్ధుడు పలికెను.

**అనంత మహిమోపేతం అదివ్యాధి వినాశకం ।**
**భక్తానందప్రదం దేవం విశ్వదత్తం నమామ్యహం ॥**

**ఓం శ్రీం విశ్వదత్తాయ నమః । ఓం శ్రీ సాయిరాం గురుదేవదత్త ॥**

**చతుర్థాధ్యాయం సమాప్తం**



# పంచమాధ్యాయం

గుణవృద్ధుడిట్లనుచున్నాడు, “నాయనా! తామీ లోకమునకు వచ్చిన పని నెరవేర్చు నిమిత్తము స్వగృహమును, తల్లి సోదరులను, బంధువులను వీడి కొంతకాలము రైలుపేటలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని, విశ్వదత్త సాధన చేయు చుండిరని లోగడ చెప్పియుంటిని. కొన్ని దినములకు ఆ ఇంటిని కూడా వదలి, శ్రీ ఆకుల కోటేశ్వరరావు దంపతుల భక్తికి లోబడి, వారి శ్రీనిలయమునే తమ నిలయముగా చేసికొని నివసించుట మొదలు పెట్టిరి. ఆ భవనమే నేడు విశ్వమందిరముగా పిలువబడుచున్నది. తాము కన్న కుమారుడు సురేష్, కుమార్తె మాధురీల కన్న మిన్నగా ఆ దంపతులు విశ్వదత్తను వాత్సల్యపూరితులై, భక్తి పరీతులై, శ్రద్ధాసక్తులతో సేవించు చుండుట భక్తులకెల్లరకు మార్గదర్శకమై విలసిల్లుచున్నది.

“శ్రీ విశ్వంజీ రైలుపేటలో నున్నప్పుడు ఒకసారి షిరిడి యాత్ర తలపెట్టిరి. ఆ యాత్రలో పాల్గొను భాగ్యము శ్రీ కోటేశ్వరరావుగారి ధర్మపత్ని కామేశ్వరికి కలిగినది. ఆ యాత్రలో గురుదేవుల శక్తి యెట్టిదో ఆమెకు బాగుగా తెలియ వచ్చినది. అతిసారవ్యాధితో బాధపడుచున్న ఆమెకు విభూతి ప్రసాదమున స్వస్థత విశ్వదత్త చేకూర్చిరి. ఆ ప్రేమమూర్తిలో ఆమె సత్యసాయిబాబాను దర్శించి సర్వస్య శరణా గతురాలయ్యెను. నాటినుండి ఆమె నిత్యము తమ యింటినుండి ఆహారము తెచ్చి విశ్వదత్తకు పెట్టుచుండెను. విశ్వయోగిపై ఆమె చూపు వాత్సల్యము చూచి ఆమెను **యశోద** యని పిలిచెడి వారు. అలనాడు కృష్ణునకు యశోద వలె, షిరిడి సాయికి బాయిజాబాయి వలె, సత్యసాయికి కరణం సుబ్బమ్మ వలె విశ్వయోగికి ఈశ్వరి

కన్నతల్లి కన్న మిన్న యైనది. అది ఎన్ని జన్మల భక్తియో! ఆమె భక్తి విశ్వయోగిని బంధించి వేసినది.

కోటేశ్వరరావు దంపతులు కృష్ణనగరులో నూతనముగా భవనము నిర్మించి, వాస్తు దోషములేవైన యున్నచో సరిచూడుడని విశ్వయోగిని ప్రార్థించిరి. ఒకనాడు విశ్వయోగి వారి గృహమునకు హఠాత్తుగా వచ్చి ఇల్లంతయు తిరిగి డాబామీదకు పోయి తమ శాటీని పరచుకొని పరుండిరి. అది చూచి ఈశ్వరి ఆశ్చర్యపోయెను. ఆ యిల్లు తనదనియు, ఇకముందు తామచ్చటనే నివసించ దలచుకొన్నామనియు తెలుపుటకుగాను వారట్లు చేసిరని ఆ తరువాత ఆ చర్యకు అర్థము తెలిసినది.

“దత్తజయంతి ఉత్సవములైన తరువాత రైలుపేటలోని తమ అద్దెయింటిని ఖాళీచేసి, 1988లో ఆకుల కోటేశ్వరరావుగారి శ్రీ నిలయమునే వారు తమ విశ్వమందిరముగా జేసికొనిరి. 1988లో విశ్వయోగి 44వ జన్మదినోత్సవము మొట్టమొదటి సారిగా ఆ మందిరములో వైభవోపేతముగా జరిగెను. విశ్వనగరు నిర్మాణము పూర్తి అయిన కొంతకాలము వరకూ విశ్వయోగి జన్మదినోత్సవ వేడుకలు మందిరముననే జరుగుచుండెడివి. 1989వ సంవత్సరములో తమ 45వ జన్మదినోత్సవ సందర్భమున సత్యము, శీలము, ఐకమత్యము, పవిత్రత అను నాలుగు ప్రధాన లక్ష్యాలతో విశ్వమానవ సమైక్యతా పతాకమును విశ్వమందిరములో ఆవిష్కరించిరి. 1989 సంవత్సరములో గురుపూర్ణిమనాడు మాధవపెద్ది రాధాకృష్ణమూర్తిగారు కన్వీనరుగా, కరుణశ్రీ, జి.వి.యల్. నరసింహారావు, జి. రామారాయుడు, ఆకుల కోటేశ్వరరావు, డాక్టరు. సి. మల్లికార్జునరావు, మానికొండ రాజారావు, విద్వాన్ గోగినేని కనకయ్య, దేచిరాజు వెంకట్రావు వంటి వ్యక్తులు కార్య నిర్వాహక సభ్యులుగా విశ్వయోగి అధ్యక్షతన **“విశ్వమానవ సమైక్యతా సంసత్”** ఆవిర్భవించింది. **విజ్ఞానవేత్తల, మేధావంతుల జ్ఞానమును, మేధను సంఘటితపరచి, విశ్వమానవ సౌభాగ్యము, విశ్వకళ్యాణము సాధించుటయే ఆ సంసత్ ఉన్నతాశయము. సనాతన ధర్మమును, యోగశాస్త్రమును ఆచరణలోనికి తీసుకొనివచ్చుట, మానవునిలోని దివ్యత్వమును పెంపొందించుట మున్నగు తొమ్మిది ప్రధాన ఆశయములతో ఆ సంసత్ మేధావులనందరిని సంఘటితపరచి, వారి శక్తులను సమాజసేవకొరకు సంసిద్ధపరచుట విశ్వంజీ ధ్యేయముగా పెట్టుకొనిరి.** విశ్వవికాస కేంద్రములు ఊరూరా

ప్రారంభించవలయునని గురుదేవుల సంకల్పము. దానికి నాందిగా పెదనందిపాడులో ఒక విశ్వవికాస కేంద్రము 1991 మార్చి 7న దాసరి శేషగిరిరావుగారి అధ్యక్షతన ఏర్పాటు చేసిరి. ఆ తర్వాత హైదరాబాదులో, సికింద్రాబాదులో, రెండు విశ్వవికాస కేంద్రాలు, ఏలూరు, ఒంగోలు మున్నగుచోట్ల నేడు విశ్వవికాస కేంద్రములు వెలసినవి.

"గుంటూరు చెన్నై జాతీయ రహదారిపై గుంటూరుకు 16 కి.మీ. దూరములో ఇరవై అయిదు ఎకరములకు పైగా సువిశాల మైదానమును **విశ్వనగరు**గా రూపొందించి అచ్చట 1991 మార్చి 30వ తేది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గౌ॥ శ్రీ రంగనాథమిశ్రగారిచే విశ్వమానవ సమైక్యతా స్తూపమునకు వైభవముగా శంఖుస్థాపన చేయించిరి. అచ్చట ఆ స్తూప నిర్మాణము సంపూర్ణమైనది. అక్కడ అన్నపూర్ణాలయము, కొన్ని శాంతికుటీరము, ఆడిటోరియముల నిర్మాణము సంపూర్ణమైనది. ఇంకను నవజీవన్ మున్నగు ఇతర కట్టడములను ఏర్పాటు చేయ తలపెట్టిరి. విశ్వగురు పీఠము అచ్చట ఈనాడు వెలసినది. శ్రీ కల్పవృక్ష వరసిద్ధి వినాయకుడు, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ శ్రీనివాస విశ్వకుండలినీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారలతో పాటు ఔదంబర కల్పవృక్ష వేదికపై విశ్వగురు పాదుకలు, దానితో పాటు వలయాకారములో చిన్న చిన్న గోపురములలో దత్తాత్రేయులు వారి విగ్రహము, కలియుగ దత్తావతారులైన శ్రీ శ్రీధరమహరాజ్, శ్రీ నరసింహసరస్వతి, శ్రీ షిర్డిసాయి, శ్రీ వాసుదేవానంద సరస్వతి, శ్రీ గజానన్ మహరాజ్, శ్రీ సమర్థ రామదాస్, శ్రీ అక్కలకోట మహరాజ్, శ్రీ మాణిక్యప్రభు, శ్రీ పాద శ్రీవల్లభుల వారల విగ్రహములు ప్రతిష్ట కావించబడినవి. ఇంకను అనేక ఇతర దేవతా మూర్తుల విగ్రహాలు విశ్వనగర్‌లో ప్రతిష్టింపబడినవి. బృహత్ ప్రణాళికతో అక్కడ నిర్మించబడిన కట్టడములకు కీ.శే. శ్రీ యస్.యస్. నారాయణగారు రూపకల్ప చేసియున్నారు. ఈ ప్రణాళిక అమలు అధిక వ్యయ ప్రయాసలతో కూడినది. దీనికి అశేష ధన, వస్తు, సేవా సంపత్తులు కావలసియున్నవి. ఈ విశ్వమానవ సమైక్యతా స్తూపం నా లక్ష్యం, నా ప్రాణం, నా ధ్యేయం, నా స్పందన, నా సర్వస్వం. అది జ్ఞానాలయం. దీని విజయమునకు కృషి చేయటమే మీ నిజమైన భక్తి ప్రకటన, అని శ్రీశ్రీశ్రీ విశ్వయోగి ఆ స్తూప శంఖుస్థాపన మహోత్సవ సభలో ప్రకటించిరి. ప్రతి వ్యక్తి తన సాయశక్తుల ఈ మహా యజ్ఞమునకు సహకరించుట అతని విద్యుక్త ధర్మము. గురువు యెడ చూపించవలసిన భక్తి శ్రద్ధలకు అదియే నిదర్శనము.

గురువునకు భిక్ష ప్రసాదించుటకు ఇంతకన్నను సదవకాశము మరియొకటి లభించదు," అని గుణవృద్ధుడు పలికెను. అది విని ఆ సాధకుడు, "స్వామీ! విశ్వదత్తను గురించి చాలా వివరముగా బోధించినారు. ఈనాడు తమలక్ష్య సిద్ధికై విశ్వదత్త చేపట్టిన కార్యక్రమములను గురించి వినవలెనని కుతూహలముగానున్నది. దయయుంచి ఆ వివరములను గూడా తెలియజేయ వలసినదని", సాధకుడు ప్రార్థించగా గుణవృద్ధుడిట్లు పలికెను, "దేహమే దేవాలయం, హృదయమే దైవ పీఠమని విశ్వదత్త పలు సార్లు చెప్పుచుందురు కదా! అందరూ దేహ ఆరోగ్యాన్ని చక్కగా కాపాడుకోవాలన్న ఉద్దేశ్యముతో, ముఖ్యముగా పల్లెలలో నివసిస్తున్న పేద ప్రజలకు సరైన వైద్య సదుపాయములు అందుబాటులో లేవని గ్రహించి, ప్రాథమిక చర్యగా ప్రతి నెలలో మూడవ ఆదివారం నాడు విశ్వనగరులో ఉచిత వైద్య శిబిరాన్ని కొన్ని సంవత్సరాలుగా భక్తులైన వైద్యుల సహకారంతో నిర్వహింపచేస్తున్నారు. ప్రతి నెల విశ్వనగరు చుట్టుప్రక్కల గ్రామవాసులు రమారమి నాలుగు వందలమంది ఉచిత వైద్యాన్ని పొందుతున్నారు. వారికి కావలసిన మందులన్నీ ఉచితంగా ఇవ్వబడుతున్నాయి. కంటి అద్దాలు కూడా ఉచితంగా ఇవ్వబడుతున్నాయి. ఈ ఉచిత వైద్య శిబిరాలలో వివిధ వైద్యశాఖలలో ప్రవీణులైన వైద్యులు, హృద్రోగనిపుణులు, కంటివైద్యులు, దంత వైద్య నిపుణులు, థైరాయిడ్ నిపుణులు, మొదలైన వారు ఇతరనగరాల నుండి కూడా వచ్చి స్వచ్ఛందంగా విశ్వదత్త పట్ల భక్తితో తమ సేవలను అందజేయడం పేర్కొనదగిన విషయం.

"సమాజానికి ఉచితంగా, ఉన్నత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొని రావలెనంటే ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం సరిపోదు. అందుకనే విశ్వదత్త తమ దివ్య సంకల్పంతో **Viswayogi Institute of Medical Sciences - (VIMS)** అన్న పేరుతో వైద్య విజ్ఞానశాస్త్ర సంస్థనొక దానిని విశ్వనగరులో స్థాపించి దానికి అనుబంధంగా స్త్రీ శిశువుల ఆరోగ్యం కోసం, వారి సంక్షేమం కోసం **VIMS Mother and Child Care Hospital** అన్న ఒక సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్‌ను నిర్మించారు. దానిని **భారతరత్న అబ్దుల్‌కలాం పూర్వ రాష్ట్రపతి జాతికి 3.4.2008న అంకితం చేశారు. మాతా శిశువులకు అన్ని రకాల వైద్య సదుపాయాలను అది అందజేయనున్నది. విశ్వదత్తకు మానవాళి పట్ల ఉన్న అపార మాతృప్రేమకు ఇది తార్కాణం.**

"తమ లక్ష్య సాధనకు, ముఖ్యంగా ప్రపంచంలోని మేధావులను సంఘటిత పరచి, విశ్వశాంతిని నెలకొల్పి, విశ్వ మానవ కళ్యాణానికి పాటు బడాలన్న ఉద్దేశ్యంతో మార్చి 5, 2003తో ప్రారంభమైన సంవత్సరాన్ని దివ్యయాత్రా సంవత్సరంగా విశ్వదత్త ప్రకటించారు. ఆ ప్రకటన అనుసారము 2003లో ప్రారంభించి ప్రతి సంవత్సరము అమెరికాలోని భక్తుల అభ్యర్థన మేరకు ఆ దేశానికి తమ దివ్య యాత్ర గావిస్తున్నారు. అచ్చటి మేధావులనేక మందిని తమ ప్రవచనాలతో, సందేశాలతో విశ్వదత్త ఉత్తేజపరచి తమ లక్ష్య సాధనలో వారూ పాలు పంచుకొనేటట్లు చేస్తున్నారు. ఈ విధంగా ఉత్తేజితులైన వారిలో అనేక మంది అమెరికన్లు కూడా ఉన్నారు. విశ్వదత్త సందేశం ఒక దేశానికి, ఒక మతానికి చెందక విశ్వసమ్మతమైనందున పలువురు ఇతర మతాల వారు వారి సందేశాలకు ముగ్ధులై ఆకర్షితులవడం గమనార్హం." గుణవృద్ధుని ఈమాటలు విని సాదకుడు. "స్వామీ! విశ్వదత్తను గురించి సమగ్రముగా బోధించి నాకు విశ్వదర్శనము చేయించినారు. మీ మేలు ఈ జన్మలో మరువలేను", అని అతని పాదపద్మములకు సాష్టాంగ నమస్కారము చేసి విశ్వదత్తనిట్లు స్తుతించెను.

**నమోశ్రీ విశ్వనాథాయ । నమో శ్రీ విశ్వదత్తాయ ।**
**నమో శ్రీ విశ్వరక్షకాయ । సద్గురవే నమో నమః ॥**

ఈ వ్రతకథను చదివిన వారికిని, విన్న వారికిని శ్రీ విశ్వదత్త అనుగ్రహము వలన ఐహికాముష్మిక సౌఖ్యములు కలిగి సకలాభీష్టములు సిద్ధించగలవు. ఈ వ్రతము సల్పినవారికి శ్రీ విశ్వదత్త దయవలన ఆయురారోగ్య ఐశ్వర్యములతో, పుత్రపౌత్రాభివృద్ధి కలిగి అభ్యుదయ పరంపరలందగలరు.

**ఓం శ్రీం విశ్వదత్తాయ నమః । ఓం శ్రీసాయిరాం గురుదేవదత్త ॥**
**శ్రీ విశ్వదత్త వ్రతకథ సర్వము సంపూర్ణము ॥**